

సాక్షి గుంటూరు

ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025



బ్యారేజీ నుంచి నీటి విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి 3,007 క్యూసెక్కులు నీటిని విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,10,540 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 2,50,853 క్యూసెక్కులు వదులుతున్నారు.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో జరిగే నిత్యాన్నదానానికి కృష్ణాజిల్లా పోరంకికి చెందిన కొమ్మినేని ప్రతాప్‌కుమార్ దంపతులు శనివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

న్యూస్‌రీల్

గుంటూరు జిల్లా ఎస్పీగా వకుల్‌జిందాల్



నగరంపాలెం: గుంటూరు జిల్లా ఎస్పీగా వకుల్‌జిందాల్ నియమితులయ్యారు. 2016 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ఏఎస్పీగా రంపచోడవరం, కృష్ణా జిల్లా సెబ్‌లో విధులు నిర్వర్తించారు. ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందిన తర్వాత సీఎం సెక్యూరిటీగా, బాపట్ల జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తించారు. విజయనగరం జిల్లా ఎస్పీగా వ్యవహరిస్తున్న వకుల్‌జిందాల్ శనివారం గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఎస్పీగా ఉన్న సతీష్ కుమార్‌ను శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు. సతీష్‌కుమార్ సుమారు 14 నెలల పాటు విధులు నిర్వర్తించారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు.

జిల్లాకు 675 మెట్రిక్ టన్నుల ఎరువులు



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాకు వివిధ కంపెనీల నుంచి 675 మెట్రిక్ టన్నుల ఎరువులు శనివారం సరఫరా అయ్యాయి. స్థానిక రెడ్డిపాలెం రైల్వేస్టేషన్ రేక్ పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరిన ఎరువులను గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వర రావు, గుంటూరు ఏడీఏ ఎస్.మోహనరావులు పరిశీలించారు. గుజరాత్ రాష్ట్ర ఫెర్టిలైజర్స్ కెమికల్స్(జీఎస్ఎఫ్‌సీ) కంపెనీకి చెందిన యూరియా 375 మెట్రిక్ టన్నులు, ఐపీఎల్ కంపెనీకి చెందిన డీఏపీ 300 మెట్రిక్ టన్నులు వచ్చినట్లు పేర్కొన్నారు. వీటిలో యూరియాను మార్క్‌ఫెడ్‌కు 150 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్స్‌కు 150 మెట్రిక్ టన్నులు సరఫరా చేయనున్నట్లు డీఏఓ వెల్లడించారు. జిల్లాకు వచ్చిన 375 మెట్రిక్ టన్నుల డీఏపీని మార్క్‌ఫెడ్‌కు 322 మెట్రిక్ టన్నులు, 53 మెట్రిక్ టన్నులు కేటాయించనున్నట్లు ఆయన వివరించారు.

గుంతలో పడి బాలుడు మృతి

సంగం డెయిరీ క్వార్టర్స్ సమీపంలో ఘటన

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి సంగం డెయిరీ క్వార్టర్స్ సమీపంలోని గుంతలో పడి బాలుడు మరణించిన సంఘటన శనివారం జరిగింది. వేమూరు సమీపంలోని రావికంపాడు గ్రామానికి చెందిన మధు కుటుంబం డెయిరీ క్వార్టర్స్‌లో ఉంటూ సంగం డెయిరీలో ఉద్యోగం చేస్తున్నారు. శనివారం మధు కుమారుడు గోపి (8) మిగతా పిల్లలతో క్వార్టర్స్ సమీప ప్రాంతంలో ఆడుకుంటున్నాడు. బయట ఉన్న గుంతలో పడి మరణించాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఏమీ చేయలేదని ఎస్ఐ వీరనారాయణ తెలిపారు.

ఇంజినీర్లకు శిక్షణ



దుగ్గిరాల: రాష్ట్ర వ్యాప్తంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించామని ప్రభుత్వ సలహాదారు తోట ప్రభాకర్ రావు అన్నారు. శనివారం దుగ్గిరాల మండలంలోని చిలువూరు గ్రామంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించి సూచనలు చేసినట్లు తెలిపారు. అనంతరం ఇంజినీర్ల బృందం ఆయా పనులకు పరిశీలించింది. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

16న 'స్వచ్ఛ' బృందాలు రాక



నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత్ మిషన్ అధ్యయన బృందాలు ఈ నెల 16వ తేదీన గుంటూరు నగరానికి రానున్నాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో విభాగాధిపతులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో పారిశుద్ధ్యం మెరుగుపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అందరూ అంకిత భావంతో కృషి చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌ఛార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



ప్రశ్నించే గొంతులపై అక్రమ కేసులా?



కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను, భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తూ, ప్రత్యర్థులపై అక్రమ కేసులు పెట్టడం అప్రజాస్వామికం. సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తపై ఆ పత్రిక ఎడిటర్‌ను బాధ్యున్ని చేస్తూ కేసు నమోదు చేయడం దుర్మార్గం. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాసే హక్కు ఏ ప్రభుత్వానికీ ఉండదు. కూటమి ప్రభుత్వం దాదాపు రూ.2 లక్షల కోట్ల రుణాలు చేసింది. అభివృద్ధి పేరుతో ప్రభుత్వ భూములను పందేరం చేస్తున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు అవినీతిపరులుగా మారారు. వారిపై ఎటువంటి కేసులు పెట్టకుండా వారి అవినీతి విషయాలను వెలుగులోకి తీసుకువస్తున్న పత్రికలపై అక్రమ కేసులు బనాయించడం పరిపాటిగా మారింది. సాక్షి దినపత్రిక ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి.

– వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు, జనచైతన్య వేదిక

మీడియా స్వేచ్ఛను హరించాలనుకోవడం దుర్మార్గం



మీడియా స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం హరించాలనుకోవటం దుర్మార్గం. ప్రభుత్వం చేసే తప్పులను ప్రశ్నించే హక్కు మీడియాకు ఉంది. తప్పులను ఎత్తి చూపినప్పుడు వాటిని సరిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. అది వదిలి ప్రశ్నించిన గొంతుని నొక్కాలనుకోవటం దుర్మార్గమైన రాజకీయ చర్య. వీటన్నిటికి భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. సమాజంలో ఫోర్త్ స్టేట్ అయినా మీడియా పట్ల తప్పుడు కేసులు నమోదు చేసి ఎడిటర్లను పోలీస్‌స్టేషన్లకు విచారణ పేరుతో తిప్పించటం కూటమి ప్రభుత్వం పనితీరుకు నిదర్శనం.

– కాసు మహేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, గురజాల

కుండపోత

- జలమయమైన ప్రధాన రహదారులు
- కార్పొరేషన్ కార్యాలయంలోకి మురుగునీరు
- పొంగిపొర్లిన డ్రైనేజీ కాలువలు
- పలుచోట్ల నివాసాలలోకి చేరిన వాననీరు
- ప్రధాన కూడళ్లలో భారీగా స్తంభించిన ట్రాఫిక్
- రైల్వే గేట్ల వద్ద వాహనదారులకు చుక్కలు
- తీవ్ర ఇబ్బందులు పడిన నగరవాసులు

గుంటూరు నగర వాసులకు తప్పని తీవ్ర ఇబ్బందులు



గుంటూరులో జలమయమైన విద్యానగర్ రోడ్డు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు కురిసిన భారీ వర్షానికి జనజీవనం అస్తవ్యస్తం అయింది. రహదారులు జలమయం అయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని మూడు వంతెనలు, కంకరగుంట అండర్ పాస్, ఆర్టీసీ బస్టాండ్, కొత్తపేట, ఓల్డ్‌క్లబ్ రోడ్డు, పట్టాభిపురం, విద్యానగర్, పాతగుంటూరు, లాలాపేట, ప్రగతినగర్, నందివెలుగు రోడ్డు, ఏటీ అగ్రహారం, బీఆర్ స్టేడియం వద్ద, హుస్సేన్ నగర్, చంద్రబాబునాయుడు కాలనీ, చుట్టుగుంట, కేవీపీ కాలనీ, నెహ్రూనగర్, మల్లికార్జునపేట, రాజీవ్‌గాంధీనగర్ కాకాని రోడ్డులోని పలు ప్రాంతాల్లో వాననీరు పోటెత్తింది. డ్రైనేజీలు పొంగి పొర్లడంతో వ్యర్థాలన్నీ రోడ్లపైకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కార్పొరేషన్ కార్యాలయంలోకి మురుగునీరు

నగర ప్రజలను వర్షం కష్టాల నుంచి కాపాడే సంగతి దేవుడెరుగు... ఏకంగా గుంటూరు కార్పొరేషన్ కార్యాలయంలోకే వర్షపు నీరు చేరింది. మోటార్ల సాయంతో వాటిని సిబ్బంది బెయిల్ అవుట్ చేయించాల్సిన దుస్థితి నెలకొంది. రైతు బజార్లు, కూరగాయాల మార్కెట్లలోకి వర్షపు నీరు చేరడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర అవస్థలు పడ్డారు.

రైల్వేగేటు వద్ద వేల సంఖ్యలో వాహనాలు

మూడు వంతెనల వద్ద నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో అరండల్‌పేట, అమరావతి రోడ్డు వైపునకు వెళ్లే వాహనాలన్నీ కొత్తపేట, నెహ్రూనగర్ రైల్వే గేటు, సంజీవయ్యనగర్ రైల్వే గేటు మీదుగా మళ్లాయి. అరండల్‌పేట, అమరావతిరోడ్డు వెళ్లేందుకు వేల సంఖ్యలో సంజీవయ్యనగర్ గేటు వద్దకు చేరుకున్నాయి. ఇక్కడ 5 నిమిషాలకొకసారి గేటు వేశారు. దీంతో ట్రాఫిక్ పెద్ద ఎత్తున నిలిచిపోయింది. వర్షంలోనే నిలబడి గేటు దాటేందుకు నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. మరో పక్క ఈ రహదారి వెంటే అంబులెన్స్‌లు రావడం, రైల్వే గేటు పడటంతో చాలా సేపు ట్రాఫిక్‌లోనే అవి చిక్కుకుపోయాయి. గేటు తీసిన వెంటనే అక్కడి స్థానికులు అప్రమత్తమై అంబులెన్స్‌లు వెళ్లేందుకు సహకరించారు.

స్తంభించిన జన జీవనం

శనివారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించిపోయింది. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శంకర్ విలాస్ వద్ద కొత్త బ్రిడ్జి పనులతో ట్రాఫిక్ అంతా సంజీవయ్యనగర్ రైల్వేగేటు, కొత్తపేట, అరండల్‌పేట, కంకరగుంట ఫ్లయ్ ఓవర్ మీద ప్రభావం చూపింది. నగర వాసులు వర్షంలోనే ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవాల్సిన పరిస్థితి నెలకొంది. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో స్థానికులు తోడి బయటకు పోసుకోవాల్సిన వచ్చింది. సాయంత్రం వరకు ఆగకుండా వర్షం కురిసింది. ఉద్యోగులు, విద్యార్థులు, చిరు వ్యాపారులు అవస్థలు పడక తప్పలేదు.



కంకరగుంట వద్ద భారీగా చేరిన వాననీరు



వర్షపు నీటిలో గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయ భవనం

ఉధృతంగా గుంటూరు చానల్ ప్రవాహం



పెదకాకాని వద్ద గుంటూరు ఛానల్ (కొత్త కాలువ)లో వరద ఉధృతి

పెదకాకాని: గుంటూరు చానల్ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత నెల 12వ తేదీన రాత్రి కురిసిన వర్షాలకు గుంటూరు చానల్‌కు గండి పడటంతోపాటు కట్టలపై నీరు పొంగి ప్రవహించింది. దీంతో మొక్క దశలో ఉన్న వరి పొలాలు నీట మునిగాయి. ప్రస్తుతం శనివారం కురిసిన వర్షానికి పెద్ద మొత్తంలో గుంటూరు చానల్‌కు నీరు వచ్చి చేరింది. కాలువకు కూడా నీరు ఎక్కువగా విడుదల చేయడంతో అంచులను తాకుతూ ప్రవహిస్తోంది. గుంటూరు జిల్లా సీతానగరం వద్ద ప్రారంభమైన గుంటూరు చానల్ (కొత్తకాలువ) 47 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉంది. కాలువ పొడవునా ప్రజలు నీటిని సాగు, తాగు అవసరాలకు ఉపయోగించుకుంటున్నారు. కాలువ కట్టలను పటిష్టం చేయకపోవడంతో ఎక్కడ గండి పడుతుందోనని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువ లాకులకు తూటికాడ, గుర్రపుడెక్క అడ్డపడిన ప్రాంతంలో నీటి పరిమాణం మరింతగా పెరిగి కట్టలను తాకుతోంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

గుంటూరు వెస్ట్: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా 0863 – 2234 014 నెంబర్‌తో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా ఉద్యోగులను నియమించామన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నప్పుడు కాల్ చేస్తే సంబంధిత అధికారులు వెంటనే సహాయం అందిస్తారని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు.

తాడేపల్లిలో..

తాడేపల్లి రూరల్: రాష్ట్ర విపత్తుల నిర్వహణ సమాచారం మేరకు రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురియనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 24 గంటలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సహాయక చర్యల కోసం వివిధ శాఖల అధికారులను నియమించామని, సహాయక చర్యల కోసం కంట్రోల్ రూమ్ నెం. 87903 76195ను సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



కంకరగుంట ఫ్లై ఓవర్‌పై నిలిచిన ట్రాఫిక్ (ఇన్‌సెట్) సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ జాం

సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యం

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా



బాధ్యతలు స్వీకరిస్తున్న తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందించేలా విధులు నిర్వహిస్తానని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. శనివారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలోని చాంబర్‌లో ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గుంటూరు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ఎక్కువ క్షేత్రస్థాయి పర్యటనలు చేసి ప్రజల ఇబ్బందులు తెలుసుకుంటానన్నారు. అనంతరం కలెక్టర్‌ను సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహ, డీఆర్వో ఎస్‌కే ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు, జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు, ఆర్‌డీడీఏ పీడీ విజయలక్ష్మి, డీఈఓ ఇ.రేణుక, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి మురళీధర్, డీపీఓ నాగసాయికుమార్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దుర్గాబాయి, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, హార్టికల్చర్ డీడీ రవీంద్రబాబు, కలెక్టర్ కార్యాలయం ఉద్యోగులు, ఉద్యోగ సంఘ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

జిల్లా యంత్రాంగం నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా పాలన సాగించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. గుంటూరు జిల్లా నూతన కలెక్టర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు.

లోక్ అదాలత్‌లో 11,388 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కల్యాణ చక్రవర్తి

గుంటూరు లీగల్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 11,388 కేసుల పరిష్కారం అయ్యాయి. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 41 బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 908 సివిల్ కేసులు, 10,480 క్రిమినల్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. నెల్లూరు జిల్లా, కాటూరు గ్రామం వద్ద జరిగిన ప్రమాదంలో యార్లగడ్డ శ్రీనివాసులు మరణించిన క్లెయిమ్ కేసులో వారి కుటుంబానికి యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్సు తరఫున రూ.1,11,82,343 అందించి, పరిష్కారం చేసుకున్నారు. సంబంధిత చెక్కును బాధితుల తరఫు న్యాయవాది వి.బ్రహ్మారెడ్డి , బీమా కంపెనీ తరఫు న్యాయవాది పి.రామాంజనేయులు, కంపెనీ మేనేజర్ సమక్షంలో బాధితులకు జిల్లా జడ్జి అందజేశారు.

నిన్న తురకపాలెం.. నేడు కొత్తరెడ్డిపాలెం

- జ్వరంతో ఆశా వర్కర్ మృత్యువాత
- మొద్దునిద్ర వదలని ఆరోగ్య శాఖ
- పలుచోట్ల ప్రబలుతున్న విష జ్వరాలు
- పట్టించుకోని పంచాయతీరాజ్ విభాగం
- ఎక్కడ చూసినా అధ్వానంగా పారిశుద్ధ్యం
- ఐదుగురికి స్టైఫెలో కొక్లై బ్యాక్టీరియా పాజిటివ్
- తీవ్ర ఆందోళన చెందుతున్న స్థానికులు



కొత్తరెడ్డిపాలెం ప్రాంతంలో ఇళ్ల మధ్య నిల్వ ఉన్న నీరు

సాక్షి ప్రతినిధి, గుంటూరు, చేబ్రోలు: తురకపాలెం ఘటనతో కూడా గుంటూరు జిల్లా యంత్రాంగం మొద్దునిద్ర వీడటం లేదు. తురకపాలెంలో మెలియోడోసిస్ వ్యాధితో రెండు నెలల్లోనే పెద్ద సంఖ్యలో ప్రజలు మృతి చెందిన విషయం తెలిసిందే. తాజాగా గుంటూరు జిల్లా చేబ్రోలు గ్రామ శివారు కొత్తరెడ్డిపాలెంలో ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామస్తులు దీనిపై ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం ఆశా వర్కర్ సుమలత జ్వరంతో బాధపడుతూ నాలుగు రోజులు పాటు చికిత్స పొందారు. శుక్రవారం ఆమె మరణించటం కలకలం రేగింది. జ్వరం ఇతర అనారోగ్య సమస్యలతో గత నెలలో ఇరువురు మృతి చెందారు. తురకపాలెం తరహా అనుమానిత లక్షణాలు ఇక్కడి వారికి కూడా ఉన్నట్లు ఏకంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సమీక్ష సమావేశంలోనే వెల్లడించారు. అధికారులు మాత్రం ఈ విషయాన్ని తేలికగా తీసుకున్నారు. ఇంటింటి సర్వే నిర్వహించామని, ప్రమాదకరమైన లక్షణాలు ఏమీ లేవని చెబుతున్నారు. తొమ్మిదిమంది అనుమానితుల నుంచి రక్త నమూనాలు సేకరించగా... వారిలో ఐదుగురికి నెగిటివ్ వచ్చినట్లు తెలిపారు. మిగిలిన నలుగురికి కొక్లై బ్యాక్టీరియా లక్షణాలు ఉన్నట్లు స్థానిక వైద్యాధికారిణి డాక్టర్ ఊర్మిళ చెబుతున్నారు.

విజృంభిస్తున్న జ్వరాలు....

చేబ్రోలుతోపాటు గ్రామ శివార్లలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ గుంటూరు జిల్లా వేదికగానే కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, ఏనాడు పంచాయతీలలో పారిశుధ్యం గురించి సమీక్షించిన పాపాన పోలేదు. ముఖ్యంగా తురకపాలెం, చేబ్రోలు సహా ఇతర గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. చేబ్రోలులో ఏడు దళితవాడలు ఉండగా.. ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా ఉన్నాయి.

ప్రతి ఇంట్లోనూ జ్వర బాధితులు

వర్షాలు కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి దోమలు వ్యాప్తి పెరిగింది. డ్రైనేజీ వ్యవస్థ సమస్యగా ఉంది. గ్రామంలో ప్రస్తుతం ప్రతి ఇంట్లో జ్వరాలతో బాధపడుతున్నారు. తురకపాలెంలో 109 మంది జ్వరపీడితుల నుంచి బ్లడ్ కల్చర్ పరీక్షలు చేయగా నలుగురికి మెలియోడోసిస్ ఉన్నట్లు గుర్తించారు. వీరిలో ఒకరు మరణించగా ముగ్గురు కోలుకున్నారు. పరీక్షలు చేసిన 1,501 మందిలో 48 శాతం మందికి రక్తహీనత ఉందని గుర్తించారు. 49 శాతం మందికి ఏదో ఒక ఇన్‌ఫెక్షన్లు ఉన్నట్లు తేలింది. వీటన్నింటికీ కారణాలు అన్వేషించకుండా ఆర్ఎంపీలు అధిక మోతాదులో యాంటీబయోటిక్స్ ఇవ్వడం వల్లే ఇలా జరిగిందనే ప్రచారానికి కూటమి ప్రభుత్వం తెరలేపింది. వారు ప్రైవేటు ఆసుపత్రుల్లో తీసుకున్న చికిత్సలు, వాడిన మందులపై కూడా వివరాలు సేకరిస్తే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది.



వ్యాధులు ప్రబలటానికి కారణాలను తెలుసుకుంటున్న జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయన్, సిబ్బంది



చేబ్రోలు ప్రాంతంలో అధ్వానంగా పారిశుద్ధ్యం

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 2,800

మోడల్ ధర రూ. 2,400

క్లుప్తంగా

మొబైల్ మెడికల్ రైలు ప్రారంభం



లక్ష్మీపురం: మొబైల్ మెడికల్ రైలు ఉద్యోగుల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని గుంటూరు డీఆర్ఎం సుధేష్ణ సేన్ అన్నారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో శనివారం ఈ రైలును డివిజన్ వైద్య నిపుణులు లలిత, కార్పొరేట్ ఆసుపత్రుల వైద్యులు, పారామెడికల్ సిబ్బందితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రైలులో రైల్వే ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు, స్క్రీనింగ్ నిర్వహించి అవసరమైన చికిత్స అందిస్తారన్నారు. పని చేస్తున్న స్టేషన్‌ల వద్దే సేవలు అందుతాయని చెప్పారు. డాక్టర్ సీహెచ్ శ్రీనివాసు, డీఎంవో డాక్టర్ వి.సింధు దీనిని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడీఆర్ఎం ఎం.రమేష్‌కుమార్, సీనియర్ డీఓఎం జె.శ్రీనాథ్, సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): రాష్ట్రంలో రైతులకు యూరియా అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మండిపడ్డారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగినా తగ్గింపు ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. గుంటూరు కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం నుంచి యూరియా రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసిందని ధ్వజమెత్తారు. అందువల్లే యూరియా రైతులకు అందలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.విట్టల్ రెడ్డి, పీపీ జగన్నాథంలు మాట్లాడుతూ.. యూరియా కొరత తీవ్రంగా ఉంటే గతంలో కంటే బాగా సరఫరా చేశామని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు.

తెనాలి నుంచి తీరాలు దాటిన ప్రతిభ

- ఇంటర్న్ నుంచి గ్లోబల్ లీడర్ వరకు అనుదీప్ ముత్తవరపు ప్రస్థానం
- కొత్త సాంకేతిక పరిజ్ఞానంలో సత్తా చాటిన తెలుగు యువకుడు
- కేంద్ర ప్రభుత్వం నుంచి 'యూత్ ఐకాన్'గా ప్రత్యేక గుర్తింపు



అనుదీప్ ముత్తవరపు



తాను చదివిన కెల్లాగ్ యూనివర్సిటీలో విద్యార్థులతో...

తెనాలి: ఒక చిన్న స్టార్టప్ కంపెనీలో చేరిన పదేళ్లలోనే ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో ఒకటైన సంస్థలో అతి పిన్న వయసు వారైన సీనియర్ డైరెక్టర్‌గా అనుదీప్ ముత్తవరపు ఎదిగారు. క్లౌడ్, డేటా, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ రంగాల్లో సాంకేతికతలకు నాయకత్వం వహిస్తున్నారు. ఆరు దేశాల్లో విస్తరించిన రెండు వందలమంది సభ్యుల బృందాన్ని నిర్వహిస్తూ, ప్రపంచవ్యాప్తంగా అత్యవసర సేవల సిబ్బందికి సాధికారత కల్పించే పది బిలియన్ డాలర్ల పోర్టుఫోలియోకు మార్గదర్శకత్వం వహిస్తున్నారు. ఆ కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వం 'యూత్ ఐకాన్' గౌరవాన్ని అందించింది.

చదువుకునే దశ నుంచే..

అనుదీప్ ముత్తవరపు సొంతూరు తెనాలి సమీపంలోని వరహాపురం. తండ్రి ఉద్యోగరీత్యా తెలంగాణకు వెళ్లారు. గుంటూరు జిల్లాలోని కేఎల్ యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో అనుదీప్ ఇంజినీరింగ్ చదివారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో టెలీ కమ్యూనికేషన్స్‌లో మరో మాస్టర్స్ డిగ్రీ చేశారు. నార్త్ వెస్టర్న్ కెల్లాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ చదివారు. విద్యార్థి దశలోనే పలు కార్యక్రమాలను చేపట్టి గుర్తింపు పొందారు. కేఎల్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదివేటప్పుడే స్టూడెంట్ ఆర్డినెన్స్‌కు అధ్యక్షుడిగా పని చేశారు. కెల్లాగ్ స్కూలు ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ చేసినప్పుడు చూపిన ప్రతిభకు 'డీన్స్ లీడర్‌షిప్ అవార్డు'ను పొందారు.

పిన్నవయస్కుడు ఆయనే...

2015లో టెక్సాస్‌లోని ప్లానోలో ఉన్న కోడియాక్ అనే చిన్న స్టార్టప్ టెక్నాలజీ సంస్థలో ఇంటర్న్‌గా అనుదీప్ కెరీర్ ప్రారంభించారు. 2017లో మోటరోలా సొల్యూషన్స్ కంపెనీ కోడియాక్‌ను టేకోవర్ చేసింది. కొద్ది సంవత్సరాల్లోనే ఇంజినీర్ నుండి మేనేజర్, డైరెక్టర్ పదవుల నుండి ఏకంగా సీనియర్ డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. మోటరోలా కంపెనీ చరిత్రలోనే ఆ పదవిని పొందిన అతి పిన్న వయస్కుడిగా అనుదీప్ గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఆరు దేశాల్లోగల ఆయన బృందంలోని 200 మంది సభ్యుల్లో ఎక్కువమంది ఆయనతోపాటు ఉద్యోగాలు చేసినవారే ఉన్నారు. ప్రజా భద్రతా సాంకేతికతలకు అందించిన సేవలకుగాను అనుదీప్, గత జనవరిలో కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి 'యూత్ ఐకాన్–2025' అవార్డు స్వీకరించారు. గుంటూరుకు చెందిన విశ్రాంత కాలేజీ ప్రిన్సిపాల్ కొల్లి కృష్ణప్రసాద్ కుమార్తె, డల్లాస్‌లోనే డేటా సైంటిస్ట్‌గా చేస్తున్న సుస్మితతో అనుదీప్‌కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది.

పాలకవర్గం నియామకానికి మల్లగుల్లాలు

- వర్గాల పోరుతో కూటమి పాలకులు వెనుకడుగు
- శ్రీ పానకాల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఇదీ పరిస్థితి



ఆలయ గాలి గోపురం

మంగళగిరి: రాజధానిలో ప్రతిష్టాత్మకమైన మంగళాద్రిలో వేంచేసి వున్న శ్రీ పానకాల లక్ష్మీనృసింహ స్వామి ఆలయ పాలకవర్గం నియామకంపై కూటమి ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. ఆగస్టు 26వ తేదీతోనే పాలక వర్గానికి దరఖాస్తులు దాఖలు ముగియగా, 36 మంది కూటమి నాయకులు దరఖాస్తు చేశారు. ఆలయ అధికారులు వాటిని దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపారు. రాజకీయ జోక్యం అధికం కావడం, పాలకవర్గ సభ్యులను నియమించేందుకు కూటమి నాయకులలో పోటీ, పదవులు విక్రయించుకున్నారనే విమర్శలతో ప్రభుత్వం ముందడుగు వేయలేకపోతోంది. భారీగా ఆదాయం వచ్చే ఆలయ కావడంతో పాలకవర్గం తమ చేతులలో ఉంచుకోవాలని కూటమి పార్టీలు పట్టుదలతో ఉన్నాయనే చర్చ జోరుగా సాగుతోంది. పాలకవర్గంలో ఎక్స్ అఫీషియో సభ్యుడితో కలిపి 12 మంది సభ్యులకు అవకాశం ఉంది. ట్రస్ట్ బోర్డు చైర్మన్ సహా ఇతర పదవులలో అధికంగా తమ వారిని నియమించాలని బీజేపీ పట్టుపడుతున్నట్లు తెలిసింది. ఇదే స్థాయిలో జనసేన, టీడీపీ నుంచి కూడా పోటీ అత్యధికంగా ఉంది. పాలక వర్గం నియామకంపై ప్రభుత్వం, మంత్రి ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు సమాచారం. పాలకవర్గాన్ని వెంటనే నియమించి ఉత్కంఠకు తెరదించాలని కూటమి పార్టీల నాయకులు కోరుతున్నారు.

గోవులను తరలిస్తున్న వారికి బెదిరింపులు

నిందితుడిపై కేసు నమోదు

మంగళగిరి: గోవులను తరలిస్తున్న లారీని ఆపి డబ్బు డిమాండ్ చేసిన గుంటూరుకు చెందిన వ్యక్తిపై కేసు నమోదైంది. శనివారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... అనిల్ బెహరా గతంలో బీజేపీలో కొనసాగాడు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కొంత కాలంగా గోవులను తరలిస్తున్న లారీలను ఆపి బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నాడు. చిలకలూరిపేటకు చెందిన గోవుల స్మగ్లింగ్ వ్యాపారి ఇతనికి సహకారం అందిస్తున్నాడు. శనివారం నగర పరిధిలోని కాజ టోల్ గేట్ వద్ద లారీని ఆపి బెదిరింపులకు దిగగా, తాము చట్టప్రకారం రవాణా చేస్తున్నామని, డబ్బులు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించడంతో రూరల్ స్టేషన్‌లోని పోలీస్ సిబ్బంది సహకారంతో అనిల్ లారీని స్టేషన్‌కు తరలించాడు. లారీ బిల్లులు తనిఖీ చేసిన పోలీసు అధికారులు అక్రమ రవాణా జరగడం లేదని చెప్పారు. లైవ్ స్టాక్ ఆన్ వీల్స్ వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనిల్ బెహరాపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాప్రతినిధులకు ఏపీటీఎఫ్ మెమోరాండం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ చేపట్టిన నిరసన వారం ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రజాప్రతినిధులకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ మేరకు ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, మహమ్మద్ ఖాలీద్‌లు తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో కలిసి నాయకులు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా బసవ లింగారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏ ఒక్క పెండింగ్ బకాయిలు విడుదల చేయలేదని తెలిపారు. రెండేళ్లు గడిచినా పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను నియమించలేదన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు మాట్లాడుతూ అనవసరమైన యాప్స్ రద్దుకు కృషి చేయాలని కోరారు. అస్సెస్మెంట్స్ బుక్‌లెట్ల రద్దుకు మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజాతోపాటు ఎమ్మెల్యేలు ఎండీ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్‌లను వారి కార్యాలయాల్లో కలిసి మెమోరాండం అందజేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా పాత తాలూకా కేంద్రాలు, 16న జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.. ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా శాఖ అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్, నాయకులు గడిపాటి దాస్, బి.శ్రీనివాసరావు, షేక్ ఇబ్రాహీం, శివారెడ్డి, మాలకొండయ్య, శ్రీధర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు అంజి అక్రమ అరెస్టు



వెల్దుర్తి: మండలంలోని గొట్టిపాళ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బిక్కెం అంజిని పోలీసులు శనివారం అరెస్టు చేసి తీసుకెళ్లారు. ఆయన ప్రస్తుతం తెలంగాణాలోని మల్లేపల్లి వద్ద నివాసం ఉంటున్నారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన అంజిపై అక్రమ కేసులు బనాయించిన పోలీసులు అరెస్టు చేసి ఎక్కడకు తీసుకెళ్లారో కుటుంబ సభ్యులకు కూడా తెలుపలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

చెట్టుపై పడిన పిడుగు



మాచవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షానికి మాచవరం సెయింట్ ఆన్స్ లయోలా ప్రేమ నిలయం హాస్టల్ ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపై శనివారం పిడుగు పడింది. ఆ సమయంలో విద్యార్థులందరూ హాస్టల్ గదుల్లోనే ఉండడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని సిస్టర్ కవిత తెలిపారు. పిడుగు పడిన సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది స్పందించి సరఫరాను నిలిపివేశారు. ఘటన స్థలాన్ని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు పరిశీలించారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు కంకరగుంట వద్ద శనివారం రాత్రి రైలు కింద పడి ఓ యువకుడు (30) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు రైల్వే స్టేషన్ నుంచి మాచర్ల ప్యాసింజర్ రైలు కంకర గుంట గేటు వద్దకు చేరుకోగానే ఓ యువకుడు రైలు కిందపడి మృతి చెందాడు. మృతదేహం గుర్తు పట్టలేకుండా ఉండటంతో పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యగా కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు గుంటూరు రైల్వే జీఆర్పీ పోలీస్ స్టేషన్‌కు సమాచారం తెలియజేయాలని తెలిపారు.

22న చలో అసెంబ్లీ జయప్రదం చేయండి

ఏపీ కౌలు రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు



కరపత్రం ఆవిష్కరిస్తున్న కౌలు రైతు సంఘ నాయకులు

నరసరావుపేట: కౌలు రైతుల సంక్షేమం, హామీల అమలుకు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 22న విజయవాడలో నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమంలో కౌలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు పిలుపునిచ్చారు. శనివారం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో చలో అసెంబ్లీ ర్యాలీ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరిబాబు మాట్లాడుతూ కౌలు రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 400 మంది రైతులు, కౌలు రైతులు ఆత్మహత్య చేసుకుంటే ఆయా కుటుంబాలను పరామర్శించలేదని, పరిహారం ఇవ్వలేదని మండిపడ్డారు. అసెంబ్లీ, మండలిలో మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కౌలు రైతు కొత్త చట్టం అమలుకు కృషిచేయాలన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ అసమర్థ విధానాలే కౌలు రైతుల ఆత్మహత్యలకు దారితీస్తున్నాయన్నారు. కౌలు రైతుల సంక్షేమం కోసం సంఘం ఆధ్వర్యంలో దశలవారీ పోరాటాలు చేస్తామన్నారు. కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, సంఘం నాయకులు టి.పెద్దిరాజు, కె.ఆంజనేయులు, అమరలింగేశ్వరరావు పాల్గొన్నారు.

కాలువలో బాలుడి మృతదేహం లభ్యం

వారం క్రితం అదృశ్యం

కొల్లూరు: కనిపించకుండా పోయిన బాలుడు శవమై కాలువలో లభ్యమైన సంఘటన కొల్లూరులో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కొల్లూరు శివారు కేటీ కాలనీకి చెందిన తుమ్మా చింతయ్య కుమారుడు సుబ్రహ్మణ్యం (12) చిన్ననాటి నుంచి మతిస్థిమితం లేకుండా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనెల 6 నుంచి కనిపించకపోవడంతో నిరక్షరాసులైన తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికి ఊరుకున్నారు. అప్పట్నుంచి కనిపించకుండా పోయిన బాలుడు పశ్చిమ బ్యాంక్ కెనాల్ నుంచి కేటీ కాలనీ వైపు ప్రవహించే పంట కాలువలో శవమై శనివారం కనిపించాడు. మృతదేహాన్ని గమనించిన స్థానికులు తల్లిదండ్రులతో పాటు కొల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెంది వారం రోజులు గడుస్తుండటంతో మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి, ఛిద్రమైన స్థితిలో ఉంది. కొల్లూరులో ఈనెల 6న రెండు వినాయక నిమజ్జనోత్సవాలు జరిగాయి. ఇందులో ఏదో ఒక విగ్రహ ఊరేగింపు వెంట బాలుడు వెళ్లి, కాలువలో పడి మరణించి ఉండవచ్చనే అనుమానాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.ఫిట్స్‌తో బాధపడుతున్న తమ కుమారుడు ప్రమాదవశాత్తు పంట కాలువలో పడి మరణించి ఉండొచ్చని తండ్రి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ జానకీ అమరవర్ధన్ తెలిపారు.

వ్యాయామ ఉపాధ్యాయుడు గోపీపై విచారణకు ఆదేశం

కర్లపాలెం: మండల పరిధిలోని చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ, ఎన్‌సీసీ ఉపాధ్యాయుడిగా గతంలో పనిచేసిన మద్దెన గోపీపై వచ్చిన ఆరోపణలపై విద్యాశాఖ అధికారులు విచారణ జరిపేందుకు సిద్ధమయ్యారు. ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికీ వచ్చిన రూ.3,800ను స్వాహా చేశారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై 'విద్యార్థుల సొమ్ము స్వాహా' అంటూ పత్రికల్లో కూడా కథనాలు రావడంతో గోపీపై విచారణ జరిపేందుకు సిద్ధమయ్యారు. ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తమ్, జిల్లా ఉప విద్యాశాఖాధికారి సురేష్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన ఈనెల 15న చింతాయపాలెం ఉన్నత పాఠశాలకు వెళ్లి విచారించనున్నారు.